క్లుప్తంగా

గంగానమ్మకు లక్ష కుంకుమార్చన



నున్న(విజయవాడరూరల్): బోడపాడు శ్రీ గంగానమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం లక్ష కుంకుమార్చనలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తిరుప్పావడ సేవ (అన్న కూటోత్సవం) జరిగింది. సాయంత్రం పంచహారతులు, చతుర్వేద పారాయణ, శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి, పార్వతి పరమేశ్వరుల ఎదుర్కోలు, దివ్య శాంతి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు వేణుగోపాలస్వామి, గురవయ్య, కార్యక్రమ బ్రహ్మ మేడూరి సాయి పవన్ కిషోర్‌శర్మ, సెక్రటరీ విజయలక్ష్మి, జ్యోతిష పండిట్ డాక్టర్ మామిళ్ళపల్లి ఫణికుమార్, దేవస్థానం కమిటీ సభ్యులు తెనాలి లక్ష్మణరావు, పెయ్యల నాగరాజు, పెయ్యల గాంధీ, లేళ్ళ రవి కృష్ణ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ శిబిరాన్ని ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు పైడి సుధాకర్ మంగళవారం ప్రారంభించారు. ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యుడు తవ్వా పూర్ణచంద్రరావు ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ప్రయాణికులు, పాదచారులు, ముఠా కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. గత 19 ఏళ్లుగా నిర్విరామంగా వైశాఖ మాసంలో మంగళవారాల్లో పెద్ద ఎత్తున ఉచిత మజ్జిగ పంపిణీ నిర్వహిస్తున్న పూర్ణచంద్రరావు అభినందనీయులని పలువురు కొనియాడారు.

లారీ డ్రైవర్‌కు జైలు శిక్ష, జరిమానా

హనుమాన్‌జంక్షన్ రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు నూజివీడు న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించినట్లు వీరవల్లి ఎస్‌ఐ శ్రీనివాసు తెలిపారు. బాపులపాడు మండలం ఎ.సీతారామపురం పరిధిలో 16వ నంబర్ జాతీయ రహదారిపై 2020 జూన్ 26వ తేదిన చిలకంటి సాంబశివ రావు మోటార్ సైకిల్‌పై పచ్చగడ్డి తీసుకుని వస్తుండగా లారీ ఢీకొట్టింది. దీంతో సాంబశివ రావు మృతి చెందారు. ఈ దుర్ఘటనకు కారణమైన లారీ డ్రైవర్ సంజయ్ రాయ్‌పై కేసు నమోదు చేసిన అప్పటి వీరవల్లి ఎస్‌ఐ షేక్ మదీనా బాషా కోర్టుకు ఛార్జిషీట్ ఫైల్ చేశారు. దీనిపై నూజివీడు న్యాయస్థానంలో విచారణ పూర్తి కావటంతో ముద్దాయి సంజయ్ రాయ్‌పై నేర నిరూపణ కావటంతో 15 రోజుల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసు తెలిపారు.

త్యాగరాజ కృతి వైభవాన్ని చాటిన సంకీర్తనలు

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి జయంతి సందర్భంగా దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన కచేరీలు త్యాగరాజ స్వామి కృతి వైభవాన్ని చాటాయి. బుర్రా సాయి కార్తీక్ కచేరీతో సంగీత ఉత్సవాలుప్రారంభమయ్యాయి. చిదంబరి, మౌనిక శ్రీవల్లి, రమాభగవాన్, జీవీఆర్ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల విద్యార్థినులు గాత్రంతో అలరించారు. సుసర్ల నందినీశ్రీనివాస్, శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి విద్యార్థులు, రంజని బృందం, ఎంబీవీటీ సుందరి వీణతోనూ త్యాగరాజ స్వామి కృతులను పలికించారు. బుధవారం జరిగే సంగీత ఉత్సవంలో చింతలపాటి శ్రీదేవి, మల్లాది అనన్య, మోదుమూడి సుధాకర్ పాల్గొంటారు.

మహిళాపారిశ్రామిక వేత్తలకు విరివిగా రుణాలు



ఆటోనగర్(విజయవాడతూర్పు): పరిశ్రమలను స్థాపించేందుకు మహిళ పారిశ్రామికవేత్తలకు విరివిగా రుణాలు ఇస్తామని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం జనరల్ మేనేజరు రేణు కే నాయర్ తెలిపారు. ఆటోనగర్‌లోని ఎంఎస్‌ఎంఈ అసోసియేషన్ కార్యాలయంలో పారిశ్రామిక వేత్తలు, రుణ గ్రహీతలు, వ్యాపారులకు మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. రేణు కే నాయర్ మాట్లాడుతూ.. 2024-25లో రూ.22.93 తమ బ్యాంక్ ట్రిలియన్ల వ్యాపారం చేసిందన్నారు. ఎంఎస్‌ఎంఈ రంగాన్ని వృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా మహిళా పారిశ్రామికవేత్తల (నారి శక్తి)తో పాటు యువ పారిశ్రామికవేత్తలు (యువ శక్తి) కోసం బ్యాంక్ ప్రత్యేకంగా రూపొందించిన పథకాలను ఆమె వివరించారు. జోనల్ హెడ్ వి.ఎస్.భాస్కరరావు, యూనియన్ రీజినల్ హెడ్ ఎం.తిలక్, ఎన్టీఆర్ జిల్లా పరిశ్రమల శాఖ జీఎం బడుగు సాంబయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ చక్రబంధం

నిత్యం గోసాల సెంటరులో ట్రాఫిక్ సమస్య
- అడ్డగోలుగా అధిక లోడు వాహనాల రాకపోకలు
- రోడ్డు మార్జిన్ ఆక్రమణలతో సమస్య జటిలం
- పట్టించుకోని అధికారులు

కంకిపాడు: ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యంగా మారుతోంది. అడ్డగోలుగా వాహనాల రాకపోకలకు తోడు రోడ్డు మార్జిన్‌లలో ఆక్రమణలు తోడవ్వటంతో ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన కూడళ్లలో ఒకటైన గోసాల సెంటరులో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నా పోలీసు శాఖ ఆ వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



గోసాల సెంటరులో నిలిచిన ట్రాఫిక్



నిర్లక్ష్యంగా పరదా లేకుండా ఇసుక లోడు లారీ రాకపోకలు

ఇసుక లోడు వాహనాలతోనే..

విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న గోసాల సెంటరులో ట్రాఫిక్ సమస్య తలెత్తడానికి ప్రధాన కారణం ఇసుక లోడు వాహనాలే. కృష్ణా కరకట్ట వెంబడి పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లోని పలు రీచ్‌లలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

భారీ లోడుతో ట్రాక్టర్లు, లారీలు మద్దూరు, వణుకూరు, గోసాల సెంటరు మీదుగా జాతీయ రహదారి మీదికి వస్తున్నాయి. దీనికి తోడు కరకట్ట పైకి వెళ్లాలన్నా, గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలన్నా ప్రధాన మార్గంగా ఈ రహదారినే ప్రజలు వినియోగిస్తున్నారు. దీంతో ఈ మార్గం ఎప్పుడూ రద్దీగా ఉంటోంది. ఒక్కసారిగా ఏటిపాయలో నుంచి వచ్చిన లారీలు, ట్రాక్టర్లు గోసాల సెంటరుకి చేరుకునే సరికి అక్కడ వాహన రద్దీ కారణంగా ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆక్రమణలూ కారణమే..

జాతీయ రహదారి నుంచి గోసాల ప్రధాన గ్రామంలోని వంతెనకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలు సమస్య తీవ్రతను పెంచుతున్నాయి. రోడ్డు పోరంబోకు స్థలంలో దుకాణాలు ఏర్పాటుచేయటం, అక్కడే వాహనదారులు పార్కింగ్ చేయటం కారణంగా ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఆదమరిచి వాహనం నడిపితే పక్కనే ఉన్న దుకాణాలు ధ్వంసం కావటమో, వాహనాలకు ఢీకొని ప్రమాదాలు బారిన పడటమో జరుగుతుంది. ఫలితంగా వివాదాలకు కూడా గోసాల ప్రధాన సెంటరు కేంద్రంగా మారింది.

ఇసుక వాహనాలపై పరదాలు లేక..

ఇసుక లోడుతో వెళ్లే వాహనాలపై కొందరు పరదాలు కప్పటం లేదు. దీంతో ఇక్కడ ఉన్న గుంతల్లో లారీ చక్రాలు పడి కుదుపులకు ఇసుక ప్రజలపై పడి ప్రమాదాలు జరగటం నిత్యకృత్యం అయ్యింది. వెనుక ఉన్న వాహన చోదకుల కళ్లల్లో ఇసుకపడి ఇబ్బందులకు గురవుతున్నారు.

ఇక్కడ పోలీస్ పికెట్ లేకపోవటంతో..

ఇంత జరుగుతున్నా పోలీసు శాఖ స్థానికంగా ప్రత్యేక పికెట్ నిర్వహించి వాహనాల రాకపోకలను నియంత్రించటం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టడం చేయటం లేదు. దీంతో ట్రాఫిక్ ఇక్కట్లతో ప్రజలు సహవాసం చేయాల్సి వస్తోంది.

చర్యలు చేపడతాం

గోసాల సెంటరులో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెడతాం. అనధికార పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటాం. ఒకే పర్యాయం లోడు వాహనాలు జాతీయ రహదారిపైకి వచ్చే సమయంలో ప్రత్యేక చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తాం.

- డి.సందీప్, ఎస్‌ఐ, కంకిపాడు

కంకిపాడులో కలెక్టరు పర్యటన

కంకిపాడు: జిల్లా కలెక్టరు డీకే బాలాజీ మంగళవారం కంకిపాడులో పర్యటించారు. పట్టణంలోని అయానా ఫంక్షన్ హాలును సందర్శించారు. ఈనెల 30న దేవినేని ఉమా తనయుడి వివాహ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పలువురు ముఖ్య నేతలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో బందోబస్తు చర్యలను పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ గంగాధర్‌రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పెనమలూరు: కానూరు 100 అడుగుల రోడ్డులో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందటంతో పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎనికేపాడుకు చెందిన మాదు వెంకట సుబ్బారావు (43) 100 అడుగుల రోడ్డులో గాయాలతో డ్రెయినేజీలో పడి మృతి చెందాడు. మతుడు సోమవారం ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. డ్రెయినేజీలో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలం వద్దకు వెళ్లిన సీఐ వెంకటరమణ దర్యాప్తు చేపట్టారు. మద్యం షాపులో మద్యం సేవించిన సుబ్బారావు డ్రెయినేజీలో ప్రమాదవశాత్తు పడినట్లు సీఐ తెలిపారు. దీని కారణంగానే అతను మృతి చెందాడన్నారు. అయితే అతని ఒంటిపై గాయాలు ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై మృతుడి కొడుకు వెంకటసాయి మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

గన్నవరం: మండలంలోని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. అనంతరం కథలు చదివి వినిపించడం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు చిమట రామారావు, ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి పీడీ లక్ష్మి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు. పురుషోత్తపట్నం గ్రంథాలయంలో విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాల ప్రాముఖ్యత గురించి విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి దొండపాటి బాబూరావు విద్యార్థులకు వివరించారు. లైబ్రేరియన్ కే కృపానందరం పాల్గొన్నారు. ముస్తాబాద గ్రంథాలయంలో లైబ్రేరియన్ జ్యోతికుమారి పోటీలు నిర్వహించారు.

పెనమలూరు: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవలని వణుకూరు శాఖ గ్రంథాలయ అధికారి భారతి అన్నారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ పుస్తక పఠనం, కథలు చెప్పటం, చిత్రలేఖనం, క్విజ్, నీతికథలు, ఇలా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతులోల భాగంగా విద్యార్థులకు జూన్ 6వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు.

పుస్తకపఠనంతో విజ్ఞానం వృద్ధి

కంకిపాడు: పుస్తక పఠనంతో విజ్ఞానం వృద్ధి చెందుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కంకిపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగిస్తున్నారు. మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పించటం, వినటంపై పోటీలు, అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రైల్వే శాఖ సూపరింటెండెంట్ కె.రాంబాబు, ఎస్.అప్పారావు,ఎం.మౌనిక పర్యవేక్షణలో విద్యార్థులకు క్యారమ్స్, చెస్‌లో శిక్షణ పొందారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

చిన్నారులకు నీతి కథలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా సాగుతుంది. గ్రామానికి చెందిన 28 మంది విద్యార్థులు ఈ శిబిరంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు మంగళవారం హాజరయ్యారు. పుస్తక పఠనం అవశ్యకత, దాని వల్ల కలిగే ప్రయోజనాలను గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలతాదేవి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు నీతి కథలును చెప్పటంతో పాటుగా పలురకాల ఇండోర్ గేమ్స్ ఆడించారు.



పురుషోత్తపట్నంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న బాబూరావు



వణుకూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులు



కంకిపాడు గ్రంథాలయంలో పుస్తక పఠనంలో చిన్నారులు



వీరవల్లి గ్రంథాలయంలో చిన్నారులకు నీతికథలు బోధిస్తున్న లైబ్రేరియన్

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి



పదవులు పొందిన పార్టీ నేతలను అభినందిస్తున్న దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు సమన్వయంతో పని చేయాలని పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. కానూరులో మంగళవారం రాష్ట్ర, జిల్లా, మున్సిపాలిటీలో పార్టీలో వివిధ పదవులు పొందిన నేతలు చక్రవర్తిని మర్యాదపూర్వకంగా కలువగా వారిని అభినందించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ కూటమి నేతలు మాయమాటలు చెప్పి ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా నేటికీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. పార్టీ పదవులు పొందిన నేతలు ప్రజలకు వాస్తవాలు తెలిపి, కూటమి ప్రభుత్వాన్ని ఎండకట్టాలన్నారు. ప్రజా సమస్యలపై నేతలు సమన్వయంతో పోరాటం చేయాలని కోరారు. చక్రవర్తిని కలిసిన నేతల్లో రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి పి.రాఘవరావు, జిల్లా కార్యదర్శి కార్యాచరణ సభ్యుడు వీరబాబు, తాడిగడప మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా కృష్ణ, జిల్లా ప్రచార విభాగం కార్యదర్శి అద్దేపల్లి చందు, నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు పడకల కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యుడు ముచ్చు నాగముని, మద్ది రవితేజ, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆసక్తిగల రంగంలో రాణించాలి



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు: క్రీడలతోనూ ఉజ్వల భవిత ఉంటుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గోసాల శ్రీచైతన్య విద్యాసంస్థల్లో ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌ను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. క్రీడా జ్యోతి వెలిగించి స్పోర్ట్స్ మీట్‌కు హాజరైన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ఆసక్తి గల రంగాలను ఎంచుకుని రాణించాలన్నారు. ఓటమిని స్వీకరిస్తూ విజయం కోసం పాటుపడే తత్వం అలవర్చుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 1,382 మంది క్రీడాకారులు స్పోర్ట్స్ మీట్‌కు తరలివచ్చారు. త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, పరుగుపందెం, షాట్‌పుట్, ఇతర పోటీలను ఏర్పాటు చేశారు. పోటీలు బుధవారంతో ముగియనున్నాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల ఈజీఎం మురళీకృష్ణ, ఏజీఎం శ్రీకాంత్, రాజమండ్రి ఏజీఎం పార్థసారథి, సురేష్, చిన్మయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులను స్కూల్ డైరెక్టర్ సీమ ప్రత్యేకంగా అభినందించారు.

మద్యం మత్తులో యువకుడు వీరంగం



యువకుడి దాడిలో గాయపడిన సర్పంచి బాలస్వామి



సచివాలయ ఉద్యోగులతో వాదనకు దిగిన యువకుడు సతీష్

ఉయ్యూరు రూరల్: ఓ యువకుడు మద్యం మత్తులో దాడి చేసి సర్పంచిని గాయపరచిన ఘటన మండలంలోని కలవపాముల సచివాలయంలో మంగళవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. మండలంలోని కలవపాముల గ్రామ పంచాయతీలో డీఈ గా నాగబాలు విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కోరపాటి సతీష్ మద్యం తాగి వచ్చి కార్యాలయంలో ఉన్న డిఈతో తన భార్య ఆధార్ కార్డులో ఇంటిపేరు మార్చాలని వాదనకు దిగాడు. దీంతో డీఈ అది తమ పరిధిలో లేదని మ్యారేజ్ సర్టిఫికెట్ ఉండాలని సూచించాడు. మద్యం మత్తులో ఉన్న సతీష్ అక్కడికి ఇక్కడికి తిరిగే దానికి సచివాలయం ఎందుకు, ఇంత మంది ఉద్యోగులు ఏం చేస్తున్నారు అంటూ అసభ్య పదజాలంతో దూషణకు దిగాడు. వీరు ఇరువురి మధ్య వాదన జరుగుతున్న క్రమంలో పక్క గదిలో ఉన్న పంచాయతీ కార్యదర్శి సమాచారం ఇవ్వటంతో వచ్చిన సర్పంచ్ పునుగుబాటి బాలస్వామి సర్దిచెప్పే ప్రయత్నం చేయగా ఆ యువకుడు తన వద్ద ఉన్న టెస్టర్‌తో సర్పంచి చెవి పైన తల మీద మూడు మూడుపోట్ల విచక్షణా రహితంగా గాయపరిచాడు. దగ్గరలో ఉన్న స్థానికులు ఆ యువకుడ్ని విడదీసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గాయాలతో తీవ్ర రక్తస్రావంతో ఉన్న సర్పంచ్ బాలస్వామిని ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు.

కేసు నమోదు

ఈ ఘటనపై బాధితుడు సర్పంచి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్‌ఐ సురేష్ బాబు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల ఫిర్యాదు..

విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై అసభ్యకర పదజాలంతో దూషణకు దిగి దాడి చేసేందుకు యత్నించిన యువకుడుపై చర్యలు తీసుకోవాలని, సచివాలయ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఉయ్యూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న, అధ్యాపకులు, విద్యార్థులు

గన్నవరం: మండలంలోని చిన్నఆవుటపల్లిలో ఉన్న డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి జాతీయ రహదారి మీదుగా హెచ్‌సీఎల్ వరకు విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.వందన మాట్లాడుతూ.. డ్రగ్స్ బారిన పడి ఎంతో మంది యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. ముఖ్యంగా డ్రగ్స్ వినియోగం వల్ల అనేక అనారోగ్య సమస్యలను కూడా ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. ఇటువంటి హానికరమైన డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. అసోసియేట్ ప్రొఫెసర్ ప్రశాంతి ముప్పవరపు, అసిస్టెంట్ ప్రొఫెసర్ భవానీ, పలువురు అధ్యాపకులు, హెడ్ కానిస్టేబుల్స్ ఎం.రామారావు, ఎస్.నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌ఎంయూఏ రిలే దీక్షలు



గన్నవరంలో దీక్షలో పాల్గొన్న సంఘ నేతలు

గన్నవరం: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏపీపీటీడీ ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్ష మంగళవారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ దీక్ష శిబిరాన్ని అసోసియేషన్ రీజియన్ కార్యదర్శి కేవీ రావు, జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సందర్శించి దీక్ష చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తోందన్నారు. ఇప్పటికైనా ఉద్యోగ భద్రతకు సంబంధించిన సర్క్యులర్ 1/2019 వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్‌ను నిలిపివేయాలని, గత నాలుగేళ్లగా ఆగిపోయిన ప్రమోషన్లను ఇవ్వాలని కోరారు. మరో 17 ప్రధాన సమస్యలను యాజమాన్యం తక్షణం పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో ఏవీ రెడ్డి, దానయ్య, పాషా, రమేష్, సత్యనారాయణ, ఎస్వీ.కుమార్, కేఎన్.రావు, రవీంద్ర పాల్గొన్నారు.

గ్రేడ్ -5 కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు

విజయవాడరూరల్: గ్రామ సచివాలయాల్లో గ్రేడ్-5 కార్యదర్శులుగా పని చేస్తున్న వారికి గ్రేడ్- 4 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించి బదిలీలు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. పి.విజయశ్రీనివాస్ జక్కంపూడి, ఎం.వరుణ్, నున్న (సచివాలయం- 3), బి.అజేంద్ర, నున్న (సచివాలయం- 2), పి.తనూజ, (రామవరప్పాడు- 3), పి.శివరామకృష్ణ, (రామవరప్పాడు- 5), ఎ.జయభరత్‌రెడ్డి, (ఎనికేపాడు-2), డి.ఆంజనేయులు, (గొల్లపూడి- 2), కె.లక్ష్మి, (గొల్లపూడి - 4), పి.రిషినంద్, (జక్కంపూడి-3), ఉద్యోగోన్నతి లభించింది. వీరిలో పి.విజయ శ్రీనివాస్, (రామరాజ్యనగర్), కె.లక్ష్మి (జక్కంపూడి-3) పంచాయతీ కార్యదర్శులుగా నియమితులయ్యారు.

మండలంలో మొత్తం 16 మంది గ్రేడ్- 5 కార్యదర్శులుండగా వారిలో కేవలం 9 మందికి మాత్రమే ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించారు. మిగిలిన వారికి ఉద్యోగోన్నతి కల్పించకపోవడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

పెనమలూరు: యనమలకుదురు లాకుల వద్ద ఇళ్ల స్థలాలు కోల్పోయిన బాధితులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రత్యామ్నాయంగా ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 12 మంది లబ్ధిదారులకు తలా సెంటు స్థలం చొప్పున ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, టీడీపీ నేతలు కోయా ఆనంద్‌ప్రసాద్, అనంతనేని అజాద్, ప్రభాకర్, అశోక్ పలువురు పాల్గొన్నారు.

అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి ప్రీతి పాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాతలు దాపర్తి ప్రసాద్, మహాలక్ష్మీ (వేలివెన్ను) సహకారంతో 200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో పితాని తారకేశ్వర మూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బీవీఎస్సీ విద్యార్థులకు అవగాహన సదస్సు



గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో మంగళవారం బీవీఎస్సీ పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోరమాండల్ ఇండియా ఇంటర్నేషనల్ టెక్నికల్ లీడ్ డాక్టర్ మహేష్ ఏపూరి మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత పాడిపరిశ్రమ రంగానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పశువైద్యానికి సంబంధించి ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. ఈ అవకాశాలను బీవీఎస్సీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఇంచార్జి డాక్టర్ ఎం.నవీన్ స్వరూప్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.